క్లుప్తంగా

వరద బాధితులకు ఔషధాల సరఫరా


ఔషధాలను పంపుతున్న అసోసియేషన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం కర్నూలు నుంచి ఔషధాలను సేకరించి పంపించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ సహాయ సంచాలకుల సూచన మేరకు కర్నూలు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు నగరం, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, డోన్, కోడుమూరు, నంద్యాల పట్టణాల నుంచి కెమిస్టుల నుంచి మందులను సేకరించి ప్రభుత్వ సూచనల మేరకు 2,280 కిట్లను వరద బాధితుల కోసం బుధవారం విజయవాడకు పంపించారు. కర్నూలు డిస్ట్రిక్ట్ డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యాడికి పుల్లయ్య, సెక్రటరీ ఎం.శ్రీధర్, ట్రెజరర్ జి.వి జయకుమార్ పాల్గొన్నారు.

వరద సహాయక చర్యలకు 12 బృందాలు

కర్నూలు (అర్బన్): విజయవాడలో వరదల ప్రభావంతో నెలకొన్న పరిస్థితుల రీత్యా సహాయక చర్యల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి 12 బృందాలను పంపినట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు చెప్పారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఒక్కో బృందంలో ఆరుగురు సభ్యులు ఉంటారని పంచాయతీ కార్యదర్శి నేతృత్వం వహిస్తారని చెప్పారు. ఈ బృందంలో పారిశుద్ధ్య కార్మికులు, ఎలక్ట్రీషియన్, ప్లంబర్ ఉంటారన్నారు. కర్నూలు డివిజన్‌లో కోడుమూరు నుంచి రెండు, గొందిపర్ల నుంచి ఒక బృందం వెళ్లాయన్నారు. అలాగే పత్తికొండ డివిజన్‌లో ఆలూరు, మద్దికెర నుంచి ఒక్కో బృందం, పత్తికొండ నుంచి రెండు బృందాలు వెళ్లాయని చెప్పారు. ఆదోని డివిజన్‌లో ఆదోని, కోసిగి, గోనెగండ్ల, మంత్రాలయం, హొళగుంద నుంచి ఒక్కో బృందం ఉన్నాయని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఈ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటాయని డీపీఓ వెల్లడించారు.

మెడికల్ కాలేజీల నిర్మాణం ఆపొద్దు

కర్నూలు (సెంట్రల్): ఆదోని, పెనుగొండ మెడికల్ కాలేజీల నిర్మాణాలను ఆపాలని ప్రభుత్వం ఆగస్టు 30వ తేదీన ఇచ్చిన మెమోలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ఆదోనిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంజూరైనందుకు ప్రజలు ఎంతో సంతోషపడ్డారని, అయితే ఆ ఆనందం ఎంతో కాలం నిలువకుండా మెమో జారీ చేయడం తగదని వాపోయారు. ఇక్కడ మెడికల్ కాలేజీ నిర్మాణం జరిగితే పేదలకు మంచి వైద్యంతో పాటు యువత స్థానికంగానే వైద్య విద్యను అభ్యసించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ప్రభుత్వం తన నిర్ణయంపై పునరాలోచన చేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలకు దిగుతామని స్పష్టం చేశారు.

ఏపీ రైతు సంఘం కమిటీ ఎన్నిక

కర్నూలు(సెంట్రల్): ఏపీ రైతు సంఘం దిన్నెదేవరపాడు నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడిగా హరికృష్ణ, సెక్రటరీగా ఈశ్వర్, ఉపాధ్యక్షుడిగా చిన్న పక్కీర్‌లను ఎన్నుకున్నారు.

మహావీర్ నగర్‌లో భారీ చోరీ

కర్నూలు: స్థానిక బళ్లారిచౌరస్తా నుంచి కల్లూరు వెళ్లే మార్గంలో కేశవ్ గ్రాండ్ లాడ్జి వెనుక ఉన్న మహావీర్ నగర్‌లో భారీ చోరీ జరిగింది. వ్యాపారి శ్రీనివాసరెడ్డి గత నెల 25వ తేదీన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో హైదరాబాదుకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి పడక గదిలో ఉన్న బీరువాను బద్దలుకొట్టి అందులో ఉన్న 15 తులాల బంగారు నగలను మూట కట్టుకుని ఉడాయించారు. శ్రీనివాసరెడ్డి 27వ తేదీన తిరిగి ఇంటికి చేరుకోగా తలుపులు తెరిచి ఉండడంతో గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగిందని నిర్ధారించుకుని మంగళవారం (3వ తేదీ) నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విషయం బయటకు పొక్కకుండా పోలీసులు గోప్యంగా ఉంచారు. బాధిత కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం అందడంతో ఎస్‌ఐ షమీర్ బాషాను వివరణ కోరగా కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

వినాయక విగ్రహం చోరీ

హొళగుంద: అమ్మకానికి ఉంచిన వినాయకుడి విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్ద బళ్లారు శేషప్ప అనే విగ్రహ తయారీదారు వినాయక విగ్రహాలను తయారు చేసి అమ్మకానికి ఇంటి వద్ద షెడ్‌లో ఉంచాడు. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బొలెరో వాహనంలో వచ్చి ఓ విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. రూ.9 వేల విలువైన విగ్రహం చోరీ చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్టీ'ఛీ' బస్టాండు

- పారిశుద్ధ్యం అస్తవ్యస్తం
- పేరుకుపోయిన చెత్తాచెదారం, కంపు కొడుతున్న మురుగు కుంటలు
- శుభ్రం చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


వర్షపునీరు మురుగుతో కలిసి అపరిశుభ్రంగా మారిన బస్టాండ్ ఆవరణ

కర్నూలు సిటీ: నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పారిశుద్ధ్యం లోపించి అధ్వానంగా మారింది. వర్షాకాలం కావడంతో మరింత అపరిశుభ్రంగా మారి కంపు కొడుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని బస్టాండు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాల్సిన ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో బస్టాండ్ ఆవరణలో చెత్త కుప్పలతో నిండి వర్షపు నీటితో కుళ్లి దుర్వాసనతో పాటు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. బస్టాండును శుభ్రం చేసేందుకు పారిశుద్ధ్య కాంట్రాక్టర్ ఉన్నప్పటికీ తెలంగాణ బస్సులు నిలిచే ప్లాట్‌ఫారంలకు ఎదురుగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మురుగు కుంటను తలపిస్తోంది. అలాగే దుకాణాల యాజమానులు చెత్త చెదారం తీసుకొచ్చి ఇక్కడ వేయడంతో డంపింగ్ యార్డులా మారింది. పార్సిల్ సర్వీస్ సమీపంలో రోడ్డుపైనే వర్షపు నీరు నిలవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో పాటు అనుపమ హోటల్‌కు ఎదురుగా సైకిల్ స్టాండ్ పక్కన ఉన్న కాంప్లెక్స్ మెట్ల వద్ద శుభ్రం చేయకపోవడంతో అపరిశుభ్రంగా మారింది. అక్కడ ఓ లాడ్జి యాజమాని సెప్టిక్ ట్యాంకు నిర్మించడం... వాసన రాకుండా చేయాల్సి ఉన్నా ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. దీనిపై జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులును వివరణ కోరగా బస్టాండ్ ఆవరణను శుభ్రంగా ఉంచేందుకు నియమించిన వారిపై విచారించి చర్యలు తీసుకుంటాం. వర్షాలు ఉండడంతో కొంత ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇకపై ఎక్కడా పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.


పార్సిల్ సెంటర్ సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


పారిశుద్ధ్యం లోపించడంతో పంది సంచారం


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

ఉపాధ్యాయుని పేరు	కేటగిరీ	పని చేసే స్థలం
ఎస్.మహమ్మద్ రఫీక్	స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీషు)	జెడ్పీ హైస్కూల్, మునగాలపాడు, కర్నూలు
బి.కిరణ్ కుమార్	ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం	ఎంపీపీఎస్, ఆర్.కె దుద్యాల, కర్నూలు
బి.శ్రీనివాసరెడ్డి	స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ)	జెడ్పీ హైస్కూల్, ముజఫర్ నగర్, కల్లూరు
పుష్పావతమ్మ	ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం	ఎంపీపీఎస్ నిర్మల నగర్, కల్లూరు
జే.నాగేశ్వరయ్య	ఎస్‌జీటీ	జి.బి తాండా, ఓర్వకల్లు

కొనసాగుతున్న వర్షాలు

మండలం	వర్షపాతం(మి.మీ)
కల్లూరు	37.8
పెద్దకడుబూరు	30.6
ఎమ్మిగనూరు	32.4
కౌతాళం	26.2
గోనెగండ్ల	20.6

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు 20 మండలాల్లో వర్షం కురిసింది. గూడూరులో అత్యధికంగా 38.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తంగా సగటున 13.4 మి.మీ వర్షం కురిసింది. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ ఉండగా.. మొదటి నాలుగు రోజుల్లో 31 మి.మీ వర్షపాతం నమోదైంది. బుధవారం సాయంత్రం నుంచి కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, కల్లూరుల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. వర్షాలు తెరిపివ్వకుండా పడుతుండటంతో నేలలో తేమ శాతం ఎక్కువై పంటలు దెబ్బతింటున్నాయి. కాగా రానున్న 36 గంటల్లో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

సమాజ హితం నేను సైతం


బిర్లాగేటు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చుతున్న జయచంద్రారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఈ ఫోటోలో రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చుతున్న వ్యక్తి పేరు బి.జయచంద్రారెడ్డి. రిటైర్డ్ కర్నూలు డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్. ప్రస్తుతం ఆయన బిర్లాగేటు వద్ద నివసిస్తున్నారు. పదవీ విరమణ తర్వాత ఆయన సామాజిక కార్యక్రమాల్లో తరిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడడం, ఆ దారిపై వెళ్లేందుకు వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులు చూడలేక తన స్కూటీపై రాళ్లను తీసుకొచ్చి గుంతలో వేసి పూడ్చారు. అంతేకాదు తన ఇంటి సమీపంలో 200 మీటర్ల పరిధిలో రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో మొక్కలు నాటి పరిరక్షిస్తున్నారు. వీధిలైట్లు వెలగక పోయినా, పార్కులలో జిమ్ పరికరాలు పనిచేయక పోయినా మున్సిపాలిటీ అధికారులు, కార్పొరేటర్లకు చెప్పి మరమ్మతులు చేయిస్తుంటారు. అప్పుడప్పుడూ జిమ్ పరికరాలకు లూబ్రికెంట్ ఆయిల్ కూడా వేస్తుంటారు. ఈ వయస్సులో మీకెందుకంటే తన వంతు బాధ్యత నెరవేరుస్తున్నట్లు సెలవిస్తారు.


జయచంద్రారెడ్డి నాటిన మొక్కలు

సబ్సిడీపై సోలార్ రూఫ్ టాప్‌లు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద గృహ వినియోగదారులకు సబ్సిడీతో సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై నెడ్‌క్యాప్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహ వినియోగదారులు తమ ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లను వినియోగిస్తే విద్యుత్ బిల్లులను తగ్గించుకునే అవకాశం ఉంటుందన్నారు. వంద చదరపు అడుగుల ప్రదేశంలో రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేస్తే 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ప్రస్తుతం రూ.1000 కరెంట్ బిల్లు వచ్చే వారికి సోలార్ రూఫ్ టాప్‌తో రూ.338 బిల్లు మాత్రమే వస్తుందన్నారు. రూఫ్ టాప్ ఏర్పాటుకు బ్యాంకులు తక్కువ వడ్డీతో రుణాలు కూడా ఇస్తాయన్నారు. ఆసక్తి ఉన్న ఉన్నవారు www.pmsuryagharyojana.gov.in/apspdcl వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నెడ్ క్యాప్ డెవలప్‌మెంట్ అధికారి వీరేంద్ర బాబు, విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఉమాపతి, ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఎల్‌డీఎం రామచంద్రరావు, డీపీఓ నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

సహాయ బీసీ సంక్షేమాధికారులకు సన్మానం


ఏబీసీ డబ్ల్యూఓ శ్రీనివాసులును సన్మానిస్తున్న రిటైర్డ్ అధికారులు

కర్నూలు (అర్బన్): జిల్లాలో కొత్తగా నియమితులైన ఇద్దరు సహాయ బీసీ సంక్షేమాధికారులను రిటైర్డ్ ఏబీసీ డబ్ల్యూఓ, హెచ్‌డబ్ల్యూఓలు ఘనంగా సన్మానించారు. బుధవారం సాయంత్రం స్థానిక సి.క్యాంప్‌లోని వసతి గృహాల ఆవరణలో ఇటీవలే రూరల్ ఏబీసీ డబ్ల్యూఓగా పదోన్నతి పొందిన ఎం.శ్రీనివాసులు, అర్బన్ ఏబీసీ డబ్ల్యూఓగా బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులు నాయక్‌ను వీరు ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో రిటైర్డ్ ఏబీసీ డబ్ల్యూఓ ఎం.కృష్ణయ్య, రిటైర్డ్ హెచ్‌డబ్ల్యూఓలు నక్కలమిట్ట శ్రీనివాసులు, నాగిరెడ్డి, కేటీ బాబు,కృష్ణారెడ్డి, శ్రీనివాసులు ఉన్నారు.

ముగిసిన యోగా పోటీలు


మెడల్స్, ప్రశంసాపత్రాలు అందుకున్న విజేతలతో బ్రిజేష్ సింగ్

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న జిల్లాస్థాయి అంతర్ పాఠశాలల యోగా పోటీలు బుధవారం సాయంత్రం ముగిశా యి. కేజీబీవీ ఆస్పరి, కేజీబీవీ కృష్ణగిరి, కేజీబీవీ పంచలింగాల జట్లు వరుసగా మూడు స్థానాలను దక్కించుకున్నాయి. విజేతలకు, అలాగే వ్యక్తిగత క్రీడాంశంలో ప్రతిభ చాటిన వారికి క్రెడాయి (కాన్ఫడరేషన్ రియల్ ఎస్టేట్, డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) కర్నూలు చాప్టర్ ప్రతినిధి బ్రిజేష్ సింగ్ మెడల్స్,ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్య క్రమంలో ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు చిన్న సుంకన్న, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సబ్సిడీపై పెట్రోల్, డీజిల్

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఏదేని సొంతంగా వ్యాపారం చేస్తున్నా, గుర్తింపు కలిగిన ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తూ సొంతంగా మోటరైజ్డ్ మూడు చక్రాల వాహనం కలిగిన దివ్యాంగులు పెట్రోల్, డీజిల్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా కోరారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన వారు దరఖాస్తు ఫారం, సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం మొదటి పేజీ, ఆధార్‌కార్డు, వ్యాపారం లేదా ఏదేని ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న ధృవీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలతో దరఖాస్తు చేసుకొని తమ కార్యాలయంలో అందించాలన్నారు. మరిన్ని వివరాలకు 08518-277864 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

6న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 6వ తేదీన జిల్లా స్థాయి అండర్-14, అండర్-16,అండర్-18, అండర్-20, అండర్-23 వ యస్సు విభాగాల్లో బాలబాలికలకు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సి.సుబ్బరత్నాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలన్నారు.ప్రతిభ కనబరచి ఎంపికయిన క్రీడాకారులు ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 98664 94372 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మామపై అల్లుడి దాడి

సి.బెళగల్: మండల కేంద్రంలో బుధవారం మామపై అల్లుడు దాడి చేశాడు. స్థానిక ఎమ్మిగనూరు-గూడూరు ప్రధాన రోడ్డులో నివాసముండే ముందరింటి శ్రీనివాసులు కుమారుడైన వేణుగోపాల్‌కు తెలంగాణ రాష్ట్రం, ఐజా మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన యువతితో నాలుగేళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి కుమారుడు సంతానంకాగా, ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి. కుటుంబ సమస్యలతో ఆమె వెంకటాపురంలోని తల్లిదండ్రుల దగ్గర ఉంటుంది. ఈ క్రమంలో బుధవారం శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆమె తన తల్లిదండ్రులు, బంధువులతో కలిసి మామ అంత్యక్రియలకు సి.బెళగల్‌కు వచ్చారు. వారిని చూసిన వేణుగోపాల్ కోపోద్రిక్తుడై మామ శ్రీనివాసులు తలపై రాయితో కొట్టడంతో రక్త గాయాలయ్యాయి. ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

మాజీ సైనికుడి మృతి


వేణుగోపాలాచారి

కర్నూలు(అర్బన్): నగరంలోని బుధవారపేటలో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు వేణుగోపాలచారి బుధవారం ఉదయం మృతి చెందినట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్రా పేరయ్య చౌదరి తెలిపారు. ఈయన ఈఎంఈ నాయక్‌గా సైన్యంలో విధులు నిర్వహించి రిటైర్డు అయ్యారన్నారు. వేణుగోపాలచారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మాజీ సైనికుల కుటుంబాలకు సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. సంఘం కోశాధికారి నజీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విఫలమయ్యారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి విమర్శించారు. ధరలను నియంత్రించాలని కోరుతూ సీపీఐ చేపట్టిన నిరసన కార్యక్రమాలు మూడో రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. బియ్యం, బ్యాళ్లు, మంచినూనె, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు అకాశన్నంటుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కిలో బియ్యం రూ.70-80 ఉండగా, బ్యాళ్లు కేజీ రూ.180, నూనెలు రూ.210 పైనే ఉన్నాయన్నారు. పెట్రోల్ లీటర్ రూ.110, డీజిల్ రూ.100, గ్యాస్ సిలిండర్ రూ.950 ఉండడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఎలా బతకాలని ప్రశ్నించారు. పేదలను ఆదుకునేందుకు చౌక దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జి.చంద్రశేఖర్, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగర పాలక ఎగ్జామినర్‌గా డి.చక్రపాణి

కర్నూలు (టౌన్): కర్నూలు నగర పాలక ఎగ్జామినర్‌గా డి.చక్రపాణిని ప్రభుత్వం నియమించింది. ఆయన ప్రస్తుతం తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఆడిట్‌ఆఫీసర్‌గా పనిచేస్తున్నా రు. బుధవారం సాయంత్రం స్టేట్ ఆడిట్ సంచాలకులు డి.విజయ భారతి ఆయన్ను కర్నూలుకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సభ్యత్వ నమోదు చురుగ్గా చేపట్టాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో పార్టీ బలోపేతం కోసం సభ్యత్వ నమోదును చురుగ్గా చేపట్టాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ఆదేశించారు. బుధవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు ద్వారానే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. చురుకైన కార్యకర్తలను తయారు చేసుకోవడానికి అవకాశం లభిస్తుందన్నారు. విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని వివరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామస్వామి, విట్టా రమేష్, నగరూరు రాఘవేంద్ర, వినూషారెడ్డి, సూర్య, పీటీ సాయిప్రదీప్ పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం


ఆరోగ్య సూచనలు చేస్తున్న డెమో శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, బాలింతలు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే ఆరోగ్యం బాగుంటుందని డెమో శ్రీనివాసులు సూచించారు. బుధవారం నగరంలోని కొత్తపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 127వ వార్డు సచివాలయంలో మాతాశిశు సంరక్షణ కార్డు, వ్యాధినిరోధక టీకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు మాట్లాడుతూ.. చిన్నారులకు నిర్వహించిన టీకా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, చిన్నారులకు నిర్ణీత సమయంలో టీకాలు వేయించాలన్నారు. అక్కడున్న తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లల ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో నీరు కలుషితం కావడం వల్ల టైఫాయిడ్, అతిసారం వంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని, ప్రజలు పరిశుభ్రమైన నీటిని తాగాలన్నారు. ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు ప్రతిరోజూ జ్వర సర్వే నిర్వహించి బాధితులను యూపీహెచ్‌సీకి పంపి చికిత్స అందించాలని సూచించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్య బోధకులు పద్మావతి పాల్గొన్నారు.